www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 18 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 8

## ఏసిబి వలలో రెవెన్యూ అధికారులు

-రూ. 10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం




2లో

# కమ్యూనిస్టుల త్యాగాలతోనే తెలంగాణ విలీనం

-చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు
-పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం
-సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభలో బాగం
-ఖమ్మంలో కదం తొక్కిన సిపిఐ శ్రేణులు







**ప్రజాపక్షం/ ఖమ్మం :** కమ్యూనిస్టుల త్యాగాలతోనే భారతదేశంలో తెలంగాణ విలీనమైందని ఇందులో మరో అభిప్రాయానికి తావు లేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు స్పష్టం చేశారు. తెలంగాణ పోరాట చరిత్రను కమ్యూనిస్టుల త్యాగాలను వక్రీకరిస్తే జాతి క్షమించదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభ బుధవారం ఖమ్మంలోని జెడ్పి మీటింగ్ హాల్‌లో జరిగింది. అంతకు ముందు సిపిఐ శ్రేణులు ఖమ్మంలో కదం తొక్కాయి. పాత బస్టాండ్ సెంటర్ నుంచి జెడ్పి సెంటర్ వరకు భారీ ప్రదర్శనను నిర్వహించారు. జన సేవాదళ్ కార్యకర్తలు నిర్వహించిన కవాత్ నగర ప్రజలను ఆకట్టుకున్నది. వైరా రోడ్డు అరుణ వరణం పులుముకున్నది. జెడ్పి మీటింగ్ హాల్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన లేని వారు మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముస్లిం అయినప్పటికీ ఆయన క్రింద ఉన్న జమీందార్లు, జాగీర్‌దార్లు, పటేళ్లు, పట్వారీలలో 95 శాతం హిందువులేనని ఆయన తెలిపారు. వీరి చేతుల్లోనే భూమి ఉండేదని గ్రామీణ ప్రాంతాలలో వీరి ఆరాచకాలకు అంతుండేది కాదని ప్రజల ప్రాణ, మానాలకు, ఆస్తులకు రక్షణ ఉండేది కాదన్నారు. దీనికి తోడు భాషపరమైన ఇబ్బంది కూడా ఒక కారణమైందని హేమంతరావు తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తన రాజ్యాన్ని స్వతంత్ర రాజ్యాంగా ప్రకటించుకున్నారని మిగతా 2లో..

## సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రజా పాలన

-అర్హులందరికీ అభయ హస్తం
-అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూల్స్
-ప్రజా పాలన దినోత్సవ వేడుకలో డిప్యూటీ సిఎం భట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పేదల ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రైతులు, కూలీలు భూమి భుక్తి కొరకు భూ పోరాటాలు చేసి నిజాం ప్రభుత్వ సాయుధ రజాకార్లను ఎదిరించారని ఆయన తెలిపారు. ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలకు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తదనంతరం జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి చారిత్రిక పోరాటాలు జరిగాయని ఆయన తెలిపారు.
అందులో ఖమ్మం జిల్లా కూడా ప్రముఖ భూమిక మిగతా 2లో..

## ప్రజాస్వామ్యం మరింతగా పరిడమిల్లాలి

- నిరంకుశ పాలన అంతమొందిన సుదినం
- తెలంగాణాలో ప్రజలే పాలకులు
- అన్నిరంగాల్లో గణనీయమైన అభివృద్ధి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిజాం నిరంకుశ పాలన అంతమొందిన సుదినం అని, భారత దేశానికి 1947 ఆగస్టు15న స్వతంత్రం సిద్ధిస్తే, ఆ నాడు నిజాంపాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతం ఏడాది తర్వాత సెప్టెంబర్ 17న అతిపెద్ద పోరాటంతో భారత దేశంలో విలీనమైందని, ఆ నాటి నుండి నేటి వరకు ప్రజాస్వామ్య పాలన కొనసాగుతోందని, ఈ పాలన మరింతగా పరిడమిల్లాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఐడిఓసి కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేన ఆయన జాతీయజెండాను ఆవిష్కరించారు. మిగతా 2లో..

## విద్య వైద్య రంగానికి పెద్దపీట

మహిళల, పిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక
- స్వస్థనారీ సశక్తి పరివార్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల పిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసిందని, ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు మహిళల పిల్లల ఆరోగ్యంపై స్వస్థనారీ.. సశక్తి పరివార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 15 రోజుల పాటు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించి కుటుంబంలో తల్లిపిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రణాళిక బద్ధంగా వైద్య సిబ్బంది సేవలందించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యకరంగా జీవించేందుకు ప్రభుత వైద్య, విద్యా రంగానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వరకు మహిళల పిల్లల ఆరోగ్య పట్ల ప్రత్యేకంగా చేపట్టిన స్వస్థ నారీ సశక్తి మిగతా 2లో..

# కమ్యూనిస్టుల త్యాగాలతోనే తెలంగాణ విలీనం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమయంలో 1947 సెప్టెంబర్ 11న ఆంధ్ర మహాసభ, సిపిఐ, ఏఐటియుసి పక్షాన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మోహినుద్దీన్ లు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. సామాన్యులు సాయుధులై పోరాడారని కర్ర, వడిశ, గొడ్డెలి, రాళ్ల ఆయుధాలుగా నిజాం రక్కసి మూకలపై తిరగబడ్డారన్నారు. నైజాం తోకముడిచి పారిపోయే సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉస్మాన్ అలీ ఖాన్‌తో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నదని ఆరోపించారు. కమ్యూనిస్టుల పోరాటంతో తెలంగాణ విలీనమైతే భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు రావడంతో పాటు కమ్యూనిస్టులు బలపడతారని నిజాంతో రహస్య ఒప్పందం కుదుర్చుకుని ఆయనను రాజ్ ప్రముఖ్‌గా ప్రకటించడంతో పాటు రాజాభరణాన్ని ఇచ్చే ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. పటేల్ సైన్యాలు నిజాంకు వ్యతిరేకంగా పోరాడలేదని కమ్యూనిస్టులను హతమార్చాయని ఇది చారిత్రిక సత్యమని హేమంతరావు తెలిపారు. నిజాంతో పోరాటం కంటే యూనియన్ సైన్యాల పోరాటంలోనే ఎక్కువ మంది కమ్యూనిస్టులు మరణించారన్నారు. పరమ కిరాతకుడు ఖాసిం రజ్వీని సైతం రక్షించి విమానంలో బయటకు పంపిన ఘనత అప్పటి పటేల్‌కు ఆయన సైన్యాలకు ఉందన్నారు. ఇది వాస్తవం కాగా ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం మతాన్ని చొప్పిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారన్నారు. సాయుధ తెలంగాణ పోరాటం లేకుంటే తెలంగాణ దేశం మధ్యలో మరో కశ్మీర్‌లా రగులుతూనే ఉండేదన్నారు. సాయుధ పోరాటం ద్వారా లబ్ది పొందెందుకు ఒకరు విమోచనం, మరొకరు సమైక్యత ఇంకొకరు ప్రజాపాలన దినోత్సవమని చెబుతున్నారని హేమంతరావు తెలిపారు. ఎవరు ఏమి చెప్పినా కమ్యూనిస్టుల త్యాగాలు లేకుండా తెలంగాణ విలీనం జరగలేదన్నారు. మతోన్మాద శక్తులు తమకు సంబంధం లేని తెలంగాణ పోరాటంలో చరిత్ర కోసం పాకులాడటం సరైంది కాదన్నారు. యువతరం అమరుల త్యాగాలను స్మరించుకుని




భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. పెరుగుతున్న అంతరాలు మతోన్మాదం తదితర అంశాలపై బహుముఖ పోరాటాలు నిర్వహించడమే అమరులకు సరైన నివాళి అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జన సేవాదళ్ ఇంచార్జి సిద్దినేని కర్ణకుమార్ ప్రసంగించగా రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాత్ - భారీ ప్రదర్శన..**

సాయుధ పోరాట వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఖమ్మంలో సిపిఐ శ్రేణులు కదం తొక్కాయి. వందలాది మంది జనసేవా దళ్ కార్యకర్తలు కవాత్ నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన అంబేద్కర్ సెంటర్ మీదుగా జెడ్పి మీటింగ్ హాల్ వరకు సాగింది. పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు ప్రదర్శనలో పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రజా పాలన

(మొదటిపేజీ తరువాయి)



పోషించిందన్నారు. రజాకార్లను ఎదుర్కొని వీరోచితంగా పోరాడి ఈ ప్రాంతాన్ని ప్రజా పాలనలో భాగస్వామ్యం చేశారన్నారు. మహకవి దాశరథి తన కలం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తే బొమ్మకంటి సత్యనారాయణ, రాంచందర్‌రావు, శీలం సిద్దారెడ్డి, నల్లమల గిరిప్రసాద్, మహ్మద్ రజబ్ అలీ, వెంగళరావు లాంటి అనేక మంది ప్రముఖులు కీలక భూమిక పోషించారని భట్టి విక్రమార్క తెలిపారు. సోయాబుల్లాఖాన్ నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా కలంతో పోరాటం చేశారన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ను ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. 2030 నాటికి 1.98 లక్షల కోట్లతో 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేస్తామని 1.14 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని విక్రమార్క తెలిపారు. ఇందిరా సౌరగిరి జలవికాస పథకం క్రింద 550 మంది లబ్దిదారులను ఎంపిక చేసి సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ. 200 కోట్లతో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలలో యంగ్ ఇండియా స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నామని ఐదు లక్షల నుంచి పది లక్షలకు ఆరోగ్యశ్రీ కవరేజ్‌ను పెంచామని తెలిపారు. సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లిలో ఆసుపత్రులను అభివృద్ధి చేశామన్నారు. సత్తుపల్లి, పాలేరులో నర్సింగ్ కళాశాలలు, వైరాలో వంద పడకల ఆసుపత్రి, ఖమ్మంలో ఆసుపత్రి అభివృద్ధి, క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రూ. 180 కోట్లతో మున్నేరుపై తీగల వంతెన, రూ. 130 కోట్ల వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని జిల్లాలో రూ. 139 కోట్లతో రెండు వరుసల రహదారులను నాలుగు వరుసలుగా విస్తరించడం జరుగుతుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్, డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం మరింతగా పరిడమిల్లాలి

(మొదటిపేజీ తరువాయి)



ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ రాహుల్, ఎస్‌పి రోహిత్ రాజ్ పాల్గొన్నారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. ఆ చారిత్ర దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ అమర వీరులకు జోహార్లు అర్పిస్తున్నట్లు తెలిపారు. వారి త్యాగాల మూలంగా నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకో గలుగుతున్నట్లు చెప్పారు. తెలంగాణ చరిత్రలో ఇది గర్వకారణమైన రోజని, నిరంకుశ పాలన నుండి ప్రజాస్వామ్య పాలనలోకి అడుగుపెట్టిన రోజని చెప్పారు. ఈ ప్రజాస్వామ్యం పరిడమిల్లాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలే పాలకులని, ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీఠ వేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో గణనీయమనైన అభివృద్ధి సాధిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అట్టడుగు వర్గాలకు మేలు చేసేందుకు కులగణన రాష్ట్రంలో చేపట్టినట్లు మంత్రి చెప్పారు. గత పాలకుల పోకడల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిద్రమైందని, ఆ పరిస్థితిని గాడిలో పెట్టుకుంటూ సుపరిపాలన దిశగా అడుగులేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సీతారామ ప్రాజెక్టుతో నీటి కల నెరవేరిందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనతో జిల్లా ఖ్యాతి పెరిగిందని, భద్రాచలంకు రాకపోకలు జరిగేలా రైల్వే పనులు సాగుతున్నాయని, కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు, రింగ్‌రోడ్, బైపాస్ రోడ్, నేషనల్ హైవే పనులు ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. సింగరేణి సంస్థను బలోపేతం చేయడం, భవిష్యత్‌లో థర్మల్ సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం విశ్వకర్మ వేడుకల్లో పాల్గొన్న మంత్రి విశ్వకర్మ ఆవిష్కరణలు, శిల్పకళ, శ్రమ విలువను గుర్తిస్తూ ఆయనను ఆధ్యబ్రహ్మంగా గుర్తిస్తున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాలు, కూలీలు, శ్రమ జీవులు, చేతివృత్తిదారుల ప్రతిభ, కృషి వల్లే సమాజం సాగుతోందని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతీ వర్గానికి చేరే చర్యలు తీసుకోవడం మనందరి బాధ్యతని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణగౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, బీసీ సంక్షేమాధికారి విజయలక్ష్మీ, జిల్లా అధికారులు, ఉద్యోగులు, బీసీ సంఘం నాయకులు వెంకటాచారి, వారాధి సత్యనారాయణ, బసవపాత్రుని తిరుపతి, వారాధి రామాచారి, బి సాంబయ్య, ఎస్ కృష్ణమాచారి, కూరపాటి లింగాచారి, పోడిచేటి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఏసిబి వలలో రెవెన్యూ అధికారులు

**ప్రజాపక్షం/ తల్లాడ** : ఏసిబి వలలో మరో ముగ్గురు అధికారులు చిక్కుకున్నారు. తల్లాడ మండలం తహసీల్దార్ వంకాయల సురేష్‌బాబు, ఆర్ఐ భాస్కర్, ధరణి కంప్యూటర్ ఆపరేటర్ శివాజీ రాథోడ్ ఏసిబికి చిక్కారు. మండల పరిధిలోని ఒక రైతుకు సంబంధించిన 15 కుంటల భూమిని భూ భారతి రికార్డుల్లో ఎక్కించేందుకు రూ. 12వేలను డిమాండ్ చేశారు. చివరకు రూ. 10వేలకు అంగీకరించి దొరికిపోయారు. ఏసిబి డిఎస్‌పి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... రైతు వద్ద 15 కుంటల భూమిని రికార్డుల్లో చేర్చేందుకు రూ. 12వేలు డిమాండ్ చేశారని చివరకు రూ. 10వేలకు అంగీకరించారని ఇది ఇవ్వడం ఇష్టం లేని రైతు తమను సంప్రదించారని ఆయన తెలిపారు. తమ నగదు ఇచ్చి అధికారులకు ఇస్తుండగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిబంధనల ప్రకారం వారిని రేపు కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

# విద్య వైద్య రంగానికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)



పరివార్ కార్యక్రమాన్ని ఫైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలలో తిరుమలాయపాలెం మండలాన్ని ఎంచుకున్నట్లు వైద్య విధాన పరిషత్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. 12రోజుల పాటు కుటంబంలో మహిళల పిల్లల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి పూర్తి ఆరోగ్య సంరక్షణ చేపడతారని ఆయన అన్నారు. ప్రధానమంత్రి మహిళల పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించనట్లే రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ మహిళల పిల్లల ఆరోగ్యంపై ప్రత్యక శ్రద్ద వహిస్తున్నామని ఆయన అన్నారు. తిరుమలాయపాలెం వైద్యావిధాన పరిషత్‌ను 30 పడకల ఆసుపత్రి నుంచి 50పడకల ఆసుపత్రిగా మార్చామని, అతి త్వరలో వైద్య విధాన పరిషత్‌లో కొత్త స్కానింగ్, ఎక్స్‌రే మిషన్లు, డెంటల్ చెయిర్ నెలాఖరుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైద్య అధికారులు సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శద్ద వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. నిరుపేద ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది ఆరోగ్యంగా కోలుకున్నట్లయితే ప్రభుత్వం ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని అన్నారు. అనంతరం తిరుమలాయపాలెం ములకలపల్లి బ్రిడ్జి పనులకు రూ.1.50కోట్ల వ్యయంతో మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, ఖమ్మం పోలీస్ కమీషన్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖ్, జిల్లా వైద్యాధికారి చందునాయక్, వైద్యాధికారులు, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, పిఆర్ ఎస్ఇ వెంకట్‌రెడ్డి, డిపిఓ రాంబాబు, మండల తహశీల్దార్ విల్సన్, ఎంపిడిఓ సిలార్‌సాహెబ్, పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం** : ప్రజా పాలన దినోత్సవాన్ని రఘునాథపాలెం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల ప్రత్యేకాధికారి ఎండి ముజాహీద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలలో, సొసైటీ కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ కార్యాలయంలో సమైక్య దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన జాతీయ సమైక్య దినోత్సవ సందర్భంగా ఎంఎల్‌సి, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకట వీరయ్య, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, సామినేని హరిప్రసాద్, తిరుమలరావు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసిబిలో ప్రజా పాలన దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో మహానీయుల త్యాగఫలం వల్ల రాచరిక పాలన నుంచి విముక్తి పొంది భారత్ యూనియన్‌లో తెలంగాణ విలీనమైందన్నారు. అట్టి శుభదినమైన సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహించడం హర్షణీయమన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిఈవో వెంకట్ ఆదిత్య, డైరెక్టర్ పి. రాంబ్రహ్మం, ఉన్నతాధికారులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యం పట్ల అంకిత భావంతో పనిచేయాలి

**-ప్రైవేటు ఆసుపత్రులు నియమ నిబంధనలు పాటించాలి**
**-వారం రోజుల పాటు అధికారులు తనిఖీలు చేపట్టాలి**
**-ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలపై సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజారోగ్యం పట్ల ఆసుపత్రులు అంకిత భావంతో పని చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, వైద్యాధికారులతో కలిసి వైద్య ఆరోగ్యశాఖపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ, 627 ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలు అంకిత భావంతో మంచి వైద్య సేవలు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు వచ్చిన చాలా ఆసుపత్రులను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల పరిధిలో చేర్చుకుని జిల్లా స్థాయిలో కో ఆర్డినేటర్ల ద్వారా మానిటరింగ్ చేస్తూ కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. పేద ప్రజలకు వైద్యం అందిస్తున ఇనిస్టిట్యూట్లు, ఆసుపత్రులు అధునీక సౌకర్యాలతో పాటు క్లినికల్ ఎస్టాబ్లీష్మెంట్ చట్టం ప్రకారం నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ప్రతి ప్రైవేటు ఆసుపత్రి పొల్యూషన్ బోర్డు సర్టిఫికెట్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో నాణ్యతలు పాటించాలన్నారు. రోగితో పాటు వారి వెంట వచ్చే వారికి ఆసుపత్రులలో కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. వైద్య సేవలకు, సర్జరీలకు తీసుకునే ఫీజుల పట్టికను ప్రజలకు కనపడేవిధంగా ఉంచాలన్నారు. వైద్య శాఖాధికారులు వారం రోజుల పాటు ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది తనిఖీలు చేయాలన్నారు. సరైన వైద్యం అందించని, కనీస వసతులు లేని ఆరోపణలు వచ్చిన ఆసుపత్రులను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతి, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, డిప్యూటీ డిఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ చందు నాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాల నేల తెలంగాణ

**-జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సుదీర్ఘ పోరాటాల నేల తెలంగాణ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం తన అస్తిత్వం, గుర్తింపు కోసం సుదీర్ఘంగా పోరాటం చేసిందన్నారు. ఆనాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశామని , దశాబ్దాల పాటు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్నామన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన బతుకమ్మ, బోనాలు, సంస్కృతికి, మన కళలకు, సాంప్రదాయాలకు మంచి గుర్తింపు, ప్రాముఖ్యత లభించిందన్నారు. అభివృద్ధి ప్రమాణాలలో దేశంలోనే అనేక రాష్ట్రాల కంటే తెలంగాణ ముందుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే పరమావిధిగా అధికారులంతా కలిసి కట్టుగా పని చేయాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఖమ్మంజిల్లా మంచి పనితీరుతో ముందంజలో ఉందని ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో...



ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఖమ్మం నగరాభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ప్రజల సహకారంతో కార్పోరేషన్‌లో మరిన్ని అభివృద్ధి పనులు అమలు చేస్తామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో కార్పోరేషన్‌కు అవసరమైన నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఉప మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పక్షాన ఉంటాం

**-డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క**
**-జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి**
**-టిజెఎఫ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రికి వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు జర్నలిస్టు పక్షానే ఉంటుందని ఎవరి పక్షాన తప్పుడు కేసులు పెట్టబోదని జర్నలిస్టులు కూడా తమ విధులను బాధ్యతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం ఖమ్మంలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో టియుడబ్ల్యూజె టిజెఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టి న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ సాంబశివరావు, మరో ఇద్దరు రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. జర్నలిస్టులపై నమోదు చేయబడిన కేసులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, ఎలక్ట్రానిక్ మీడియాజిల్లా అధ్యక్షులు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజనీకాంత్, టియుడబ్ల్యూజె (ఐజెయు) ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు మామిడాల భూపాలరావు, ఐజెయు జిల్లా మాజీ అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, టిజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కలవకొలను హరీష్‌రాజు, మందుల ఉపేందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్‌బాబు, కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, పానకాలరావు, కిరణ్, నరేష్, శేఖర్, వెంకటేశ్వర రెడ్డి, జీవన్‌రెడ్డి, రమేష్, పాషా, జోసఫ్ ఉన్నారు.

# ముష్టికుంట్ల పిఎసిఎస్ సిఈఓకి సన్మానం



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని ముష్టికుంట్ల ప్రాథమిక సహకార పరపతి సంఘంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్తున్న సిఈఓ బోయినపల్లి ఉమమహేశ్వరరావుకు సొసైటీ ఛైర్మన్, పలు రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది బుధవారం సన్మానించారు. సిఈఓగా పనిచేస్తూ రైతుల మన్ననలు పొందిన ఉమామహేశ్వరరావును పలువురు అభినందించారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాలని ఆకాంక్షించారు. ఉమామహేశ్వరరావును సన్మానించిన వారిలో సొసైటీ ఛైర్మన్ బోయినపల్లి వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ కార్మిక మండల అధ్యక్షులు బంధం నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి చెల్ది ప్రసాద్, బిఆర్ఎస్ నాయకులు షేక్ హుస్సేన్, హరికృష్ణ, బొడ్డుపల్లి వీరబాబు, బంధం రంగయ్య, బంధం నాగేశ్వరరావు, ఎస్కే షాజహాన్, డైరక్టర్ దొప్ప ప్రసాద్, సిపిఐ నాయకులు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# సకల జనుల శ్రేయస్సే కాంగ్రెస్ లక్ష్యం : భట్టి



**ప్రజాపక్షం/చింతకాని :** సకల జనుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.బుధవారం చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో పార్టీ కార్యకర్త పగడాల రాధాకృష్ణ ని భట్టి విక్రమార్క పరామర్శించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. గ్రామంలోని పహిళలతో ముచ్చటించారు. మహిళలకు ఉచిత బస్సు, గ్యాసిలిండర్ సబ్సిడీ, ఉచిత కరెంటు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరా మహిళా డైరీ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు కూరపాటి కిషోర్ , కన్నెబోయిన గోపీ, బందెల నాగార్జున, మడిపల్లి భాస్కర్, కిలారి మనోహర్, పెంట్యాల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మానికి తరలిన ఎర్రదండు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంనగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయానికి ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురంమున్సిపాలిటీ నుంచి సిపిఐ శ్రేణులు బుధవారం తరలెల్లారు. తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపులో భాగంగా ఎర్ర చొక్కాలను ధరించి, ద్విచక్రవాహనాలపై ర్యాలీగా చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, మండల సమితి సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ హరిత, మున్సిపాలిటీలో మేనేజర్ నాగేశ్వరరావు, రైతువేదికలో రూప, మార్కెట్ కమిటీ లో నీరజాదేవి ఎంపీడీవో కార్యాలయంలో చంద్రశేఖర్ తాసిల్దార్ కార్యాలయంలో పులి సాంబశివుడు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో అజయ్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ అధికారులు పలు పార్టీల ప్రతినిధులు తో పాటు ఆయా కార్యక్రమాలలో భాగంగా సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దినోత్సవం ప్రత్యేకతను అధికారులు వివరించారు.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



**ప్రజాపక్షం/ మధిర :** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిర పట్టణం, మండలంలో దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మధిర పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో సిఐ మధు జాతీయ జెండాను ఎగురవేశారు. మధిర తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాంబాబు, మున్సిపాల్టీ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, మధిర విద్యుత్‌శాఖ కార్యాలయంలో సబ్‌డివిజన్ ఎడిఇ అనురాధ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాలు వివిధశాఖల అధికారులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/ మధిర :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకుని బిజెపి మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సర్దార్ జమలాపురం కేశవరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు గల్లా సత్యనారాయణచౌదరి తదితరుల పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పలువురు రక్తదాతలు పాల్గొన్నారు.

# వైరాలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం




**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు నందు జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరాలోని మున్సిపాల్ కమీషనర్ గురులింగం, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడివో సక్రియ, వైరా ఏరియా హాస్పిటల్ నందు డాక్టర్ బాలు సోమవరం ప్రభుత్వ ఆసుపత్రి నందు డాక్టర్ హర్ష, సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు కార్తీక్, నీటిపారుదల కార్యాలయం నందు డి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ కార్యాలయం నందు ఎంఈవో వెంకటేశ్వరరావుతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగరవేసి ప్రజపాలన దినోత్సవం నిర్వహించారు.

# స్వస్థ్ నారీ మెగా వైద్య శిబిరం ప్రారంభం

**-మూకమామిడి ఏకలవ్య పాఠశాల ఆదర్శంగా నిలవాలి**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండలంలోని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి ఆరోగ్య కేంద్రంలోని రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన మహిళలతో కోయ భాషలో మాట్లాడుతూ ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకొని మహిళలు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లలకు విద్య అత్యంత ముఖ్యమని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని వాటిని వినియోగించుకొని అభివృద్ధి సాధించాలన్నారు. తరువాత మంత్రి ములకలపల్లి మండలం మూకమామిడి ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఘన స్వాగతం పలికిన ఈసందర్భంగా మంత్రి తరగతి గదులు, సంగీత గది పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. మూకమామిడి ప్రాజెక్ట్ సమయంలో పది ఎకరాలు కేటాయించడం ద్వారా ఈ పాఠశాల ఏర్పాటు సాధ్యమైందని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రీడా సామాగ్రి అందించి వారిని అన్ని రంగాల్లో ముందుకు నడిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లా ఖ్యాతి పెంచే విధంగా దేశంలోనే మొట్టమొదటి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపించామని, దీని ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.



అనంతరం ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ మాట్లాడుతూ నేను సైతం చేయుత కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు రూ 1.75కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వాటిలో పాఠశాల భవనాలు, వసతి గృహాలు, ఆవరణ గోడలు, తాగునీటి సదుపాయాలు, రహదారుల మెరుగుదల వంటి పనులు ఉన్నాయని వివరించారు. గిరిజన విద్యార్థుల అభివృద్ధి, సాధికారత ద్వారా గ్రామాలు, జిల్లా, రాష్ట్రం మొత్తానికి మేలు కలుగుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి ప్రతి చర్యను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ పూర్వంలో విద్యార్థులకు సదుపాయాలు లేకపోయినా ఇప్పుడు ప్రభుత్వం విద్య ప్రమాణాలను పెంచే విధంగా అన్ని సౌకర్యాదలు కల్పిస్తోందని, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు త్యాగాలను దృష్టిలో ఉంచుకొని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు సాధించాలని సూచించారు. అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌పి రోహిత్ రాజు, ఐటిడిఏ పీవో రాహుల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ విలీన దినోత్సవం






**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** నాటి దొరలు, దేశముఖ్ లు, రజాకారుల మూకలను తరిమికొట్టి తెలంగాణకు విముక్తి కలిగించి విలీనానికి కారణమైంది. కమ్యూనిస్టులేనని, అదే స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న నేటి పాలకులకు బుద్ధి చూపేందుకు ప్రజాఉద్యమాలు నిర్మించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం శేషగిరిభవన్ లో తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట వారోత్సవాల ముగింపు సభ, విలీన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు దమ్మాలపాటి శేషయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎంతో ఉందని, భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల కోసం ముఖ్యంగా రైతుల సమస్యల గురించి, రజాకారుల రాజకీయ పాలనను అంత మొందించడంలో సిపిఐ పాత్ర ఎంతో ఉందన్నారు. 1947 సెప్టెంబర్ 11న అమరవీరులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దుం మోహియుద్దీన్ పిలుపుతో మహోద్యమం కొనసాగిందని, వారి నాయకత్వంలో సాగిన సాయుధ పోరాటం వందల ఏండ్ల చరిత్ర ఉన్న నిజాం రాజును గద్దె దింపిందని, నిజాం స్వాదీనంలో ఉన్న తెలంగాణా భూభాగాన్ని భారతదేశంలో అంతర్భాగం చేసిందన్నారు. అదే ప్రమాదకర పరిస్థితులు ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. నాడు జరిగిన వీరోచిత పోరాటం, అమరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని ప్రజావ్యతిరేక పాలకులపై తిరగబడాల్సిన భాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందని పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, వాసిరెడ్డి మురళి, జి.వీరాస్వామి, కందుల భాస్కర్, మువ్వా వెంకటేశ్వర్ రావు, ఎస్‌కె ఫేహీం సదస్సులో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్, దీటి లక్ష్మీపతి, గుగులోత్ రాంచందర్, భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, కె రత్నకుమారి, ఎం ధనలక్ష్మి, నేరెళ్ల రమేష్, మునిగడప పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు ముఠా కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలి

**-మీకు అండగా పార్టీ నిలబడుతుంది**
**-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి**



**ప్రజాపక్షం/మణుగూరు:** బొగ్గు ముఠా కార్మికులు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని, మీకు అండగా సిపిఐ పార్టీ నిలుస్తుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. బుధవారం బొగ్గు ముఠా ఆఫీసు (రాజబల్లి భవన్లో) బొగ్గు ముఠా 11వ మహాసభ శ్రీకాకుళం వీరమల్లు అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముందుగా పార్టీ జెండాను రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి ఎగరవేశారు.అనంతరం జరిగిన మహాసభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ బొగ్గు ముఠా కార్మికులు అనేక సంవత్సరాలుగా ఇక్కడ పని చేస్తున్నారని, వీరిని కొంతమంది పెట్టి చాకిరీ చేయించుకునే వారని ఇండ్లలో పని చేయించుకునే వారని, వీరి ఆగడాలను భరించలేక ఏఐటియుసి సంఘంలో చేరారని, వారి సమస్యలు ఏఐటీయూసీ పరిష్కరించామని, అప్పటినుండి ఏఐటియుసీ లో కొనసాగుతూ, సిపిఐ అనుబంధంగా ఒక ముఠా కార్మికులు కొనసాగుతున్నారని అన్నారు. సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు.

**నూతన కమిటీ ఎన్నిక...**

బొగ్గు ముఠా కార్యదర్శిగా జక్కుల రాజబాబు, అధ్యక్షులుగా షేక్ యాకూబ్, కోశాధికారిగా దాసరి లింగస్వామి, హెడ్ మేస్త్రిలుగా శ్రీకాకుళం వీరమల్లు, కనతల కోటయ్య, సైడ్ మేస్త్రిలుగా పిట్టల శీను, పూజారి యాకయ్యలుగా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది.

# ఐటిడిఏలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం





**ప్రజాపక్షం/భద్రాచలం :** స్వతంత్రం వచ్చినప్పటికీ హైదారాబాద్ సంస్థానంలో దేశంలో విలీనం కాలేదని, దీనిని దేశంలో విలీనం చేసేందుకు సాగిన ప్రయత్నాలు సఫలమై 1948 సెప్టెంబర్ 17న విలీనం అయ్యిందని ఐటిడిఏ పిఓ బి రాహుల్ అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఐటిడిఏ కార్యాలయంలో పిఓ జాతీయజెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మతో పాటు పలు యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

**ఎస్‌పి కార్యాలయంలో...**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి రోహిత్ రాజ్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ నిజాం నవాబ్ మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేసిన రోజు సెప్టెంబర్ 17 అని అన్నారు. అప్పటి నుండి దేశంలో సుపరిపాలన సాగుతోందని, ఎందరో త్యాగధనుల మూలంగా సిద్ధించిన స్వేచ్ఛను తప్పుతోవ పట్టించకుండా దేశ చట్టాలకు లోబడి పౌరులు జీవన విధానం సాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి కార్యాలయం సిబ్బందితో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మైలారం పాఠశాలలో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగ రాంబాబు మాట్లాడుతూ మనం ప్రజాపాలన దినోత్సవం జరుపుకుంటున్నామని, ప్రజాపాలన అనేది ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలు, సమస్యలను గుర్తించి వాటికి సరైన పరిష్కారం చూపడం, సమాజాన్ని సమానత్వం న్యాయం అభివృద్ధి దిశగా నడిపించడం ప్రజా పాలన యొక్క ముఖ్య లక్ష్యమన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మనం అందరం ఒక సంకల్పం చేయాలని, చట్టాలను గౌరవిద్దామని, మన హక్కులు, కర్తవ్యాలు పాటిద్దామని తెలిపారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఘనంగా నిర్వహించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మణిధర్ జెండాని ఎగరవేసి, సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం జరుపుకుంటున్నామని, చాలా సంతోషకరమని ప్రజలకు సేవ చేయడంలో అధికారులు ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటారని అన్నారు. మండలంలోని మొండికుంటలో బిజెని నాయకులు జాతీయ జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు తాటిపాముల ఐలయ్య, సురకంటి లింగారెడ్డి, నెల్లిపాక సొసైటీ డైరెక్టర్ ముస్కు ధనలక్ష్మి మండల నాయకులు కొల్లు లింగారెడ్డి, గోసుల రాములు, మాదిరెడ్డి వెంకటరెడ్డి, కడమంచి రాజేష్, పగడాల కృష్ణారెడ్డి, జంగిలి వెంకటేశ్వర్లు, పాటి వెంకటరెడ్డి, సోమ వెంకటరెడ్డి, సురకంటి మల్లారెడ్డి, ఆవుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధి 36 గ్రమపంచాయితీలలో కార్యదర్శులు జాతీయ జెండాలను ఎగురవేశారు. పాల్వంచ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ముందుగా ఎంపిడిఓ కుడుముల విజయ భాస్కర్‌రెడ్డి జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెంట్ సుధాలక్ష్మి, ఏపిఓ పోరండ్ల రంగా, సిబ్బంది శారద, రోహిణి, కళ్యాణి, శాంతి, జిలాని, వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ సిబ్బంది లక్ష్మణ్, రాజు, సైదులు, సుజాత, రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల పేరుపల్లిలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు పేరుపల్లి కాంప్లెక్స్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కలిసి వారికి పూలమాలలతో, శాలువలతో షీల్డ్ ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన గ్రహీతలుగా మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు, ఎంపీపీఎస్ పేరుపల్లి ఎల్ఏ ఫ్ఎల్ హెచ్ఎం బానోత్ శ్యామ్లాల్, జెడ్పిహెచ్ఎస్ పేరుపల్లి ఎస్ఏ ఫిజిక్స్ రామకృష్ణారావు, జెడ్పిహెచ్ఎస్ పేరుపల్లి ఎస్ఏ హిదీ మాలోత్ రాములు ఉన్నారు. ఈకార్యక్రమంలో సంఘ బాధ్యులు అజ్మీరా వీరు నాయక్, బానోత్ పాపాలాల్, అజ్మీరా బన్సీలాల్, హరీష్, బానోత్ శ్రీనివాస్‌రావు, స్లీవా రాజు, పేరుపల్లి కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, జెడ్పిహెచ్ఎస్ పేరుపల్లి ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీసీవో, సీఆర్‌పీలు తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు ఇంకా మూడు విడతలుగా అందిస్తాం

**-అభివృద్ధి సంక్షేమ పథకాలు ఆగకుండా అందిస్తున్నాం**
**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకున్నా అభివృద్ధి ఎక్కడా ఆగకుండా చేస్తున్నట్లు తెలిపారు. 21 నెలలో అనేక సంక్షేమ పథకాలు చేసి నిరూపించామని పేర్కోన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీలను అమలు చేసినట్లు తెలిపారు. ఉచిత విద్యుత్, రూ.500 లకు గ్యాస్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గం లో 3500 ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హత కలిగిన వారికి మూడు విడతలుగా ఇందిరమ్మ ఇళ్ల ను అందిస్తామని అన్నారు. ఎన్నికల సమయంలో మీరు దీవించిన ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. నిరుపేదలకు సన్న బియ్యం ను అందిస్తున్నట్లు తెలిపారు. లక్షలాది మంది రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. 11 లక్షల కార్డులు కొత్తగా అందించగా.. మరో 15 లక్షల కార్డులలో మార్పులు, చేర్పులు చేసినట్లు తెలిపారు. మండలం లోని మోటాపురం, రాజేశ్వరపురం, కొత్తకొత్తూరు, బైరవునిపల్లి గ్రామాలలో అంతర్గత రహాదారులకు శంకుస్థాపన చేశారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, వల్లాల రాధాకృష్ణ, రావెళ్ల కృష్ణారావు, జెర్రిపోతుల అంజిని,కుక్కల హనుమంతరావు, వెంకన్న, గేశ్వరరావు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, కొమ్మినేని విజయ్బాబు, కొచ్చేర్ల శ్రీనివాస రావు, బెల్లం వాసు, మురళీ, గొళ్ల శ్రీనివాస్ రావు,మరికంటి రమేష్, గండు సైదులు, లక్ష్మణ్,గోపి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలపై దృష్టి

**-ఒకటవ డివిజన్‌లో సిసి రోడ్డు పనులకు**
**మంత్రి పొంగులేటి శంకుస్థాపన**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటవ డివిజన్ కైకొండాయిగూడెంలో సిసి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ. 3.10 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఒకటవ డివిజన్ లోని మారుతినగర్, బాలాజీనగర్ లోని పలు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. డివిజన్లలోని అన్ని రహదారులను సిసి రోడ్లుగా తీర్చిదిద్దుతామన్నారు. సిసి రోడ్లతో పాటు డ్రైన్‌ల నిర్మాణం చేపడతామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ఇచ్చిన ఒక్కొక్క మాటను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. భవిష్యత్తులో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పాలేరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి రమేష్, నగర పాలక సంస్థ డిఈ ధరణికుమార్, ఏఈ నరేంద్ర తేజ, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించండి

**-విద్యార్థులకు అందించే నాణ్యమైన భోజనాన్ని అందించాలి**
**-ఎంపీడీఓ యం.యర్రయ్య**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గురుకులంలో పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల ను బుధవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. వంట గదులను, డైనింగ్ హాలు, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. విద్యార్థుల వద్ద కు వెళ్లి వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. శానిటేషన్ ఇంకా చేయాల్సి ఉందని ఆదేశించారు. రికార్డులను తనీఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురుకులంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాదులు రాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య తో పాటు నాణ్యమైన భోజనం ను అందించాలని అన్నారు. మెనూ ను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఇంట్లో ఉండే భావన ను గురుకులం కల్పించాలని పేర్కొన్నారు. గురుకులం లో శానిటేషన్ ను పూర్తి స్థాయిలో చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే..



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని, ఆ పోరాటంలో కమ్యూనిస్టులు అసమానమైన త్యాగాలు వెలకట్టలేనివని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్ అన్నారు. బుధవారం నాడు కొత్తగూడెం పట్టణం లోని మంచికంటి భవన్లో వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు పూల తో నివాళులు అర్పించారు.అనంతరం ఎజె రమేష్ మాట్లాడుతూ. కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన విరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో విషపురుగులైన కాషాయ ఉన్మాదులకు ఏమిటి సంబంధమని, మట్టి మనుషుల మహోన్నత పోరాట చరిత్ర గురించి మాట్లాడే నైతిక అర్హత మతోన్మాద బీజేపీకి లేదని విమర్శించారు. విరోచిత వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మచ్చుకైనా కనిపించని మతోన్మాదులు ఆ పోరాటానికి వారసులమంటూ సభలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 1913లో హిందూ మహాసభ 1925లో ఆర్ఎస్ఎస్ 1951లో జనసంఘ్ ఏర్పడితే ఆ పోరాటం జరిగిన కాలంలో మీరెందుకు ఆ పోరాటంలో పాల్గొనలేదని ప్రశ్నించారు. నైజాం తెలుగు మాట్లాడకూడదు అంటూ ఉర్దూ మాత్రమే ఉండాలని చెప్పిన్నట్లుగానే నేడు బీజేపీ హిందీ మాత్రమే మాట్లాడాలి అని మాతృభాష మాట్లాడకూడదని అంటుందన్నారు. కమ్యూనిస్టుల చేతుల్లోకి అధికారం పోతుందనే భయంతో నెహ్రూ పటేల్ కలిసి రజాకార్ సైన్యాల ముసుగులో కమ్యూనిస్టుల పైన దాడులు దౌర్జన్యాలు చేశారని చెప్పారు. విరోచిత త్యాగాలు చేసిన అనేకమంది కమ్యూనిస్టు యోధుల ఆశయాలు కొనసాగించాలన్నారు. ఆ పోరాట స్ఫూర్తితో భవిష్యత్ భూ పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు భూక్యా రమేష్ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి నందిపాటి రమేష్ సీనియర్ నాయకులు ఎంఎస్ ప్రకాష్, ఎన్ఎస్ రాజు, రమేష్ బాబు, నాయకులు ప్రమోద్, కొలిపాక వెంకటేశ్వర్లు, రజిత, బాలక్రిష్ణ, రాములు, రఘు, సంధ్య జ్యోతి, అరుణ, నాగమణి, రామ కోటమ్మ, రాంబాబు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహంలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో గల సాంఘిక సంక్షేమ విద్యార్థుల వసతి గృహంలో బుధవారం గుడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. 70 మంది విద్యార్థులకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్న నలుగురికి రక్త పరీక్షలు జరిపించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి నరసింహరావు, ఆసుపత్రి ప్రధాన వైద్యులు బి. హరీష్, సిఓ నాగమణి, ఏఎన్ఎం ఉమాదేవి, ఆశా కార్యకర్త పద్మ, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం



**ప్రజాపక్షం/మణుగూరుః** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మణుగూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. శ్రీనివాస రావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రభు త్వం తీసుకున్న వివిధ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను ఈ సందర్భంగా ఎంపిడిఓ వివరిం చారు. ఈ వేడుకను విజయవంతం చేసిన అందరికీ టి.శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, పూర్తి ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిగింది.

# విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్‌కు తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** విద్యుత్ షాక్ తో ప్రైవేటు ఎలక్ట్రిషన్ గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మండల పరిదిలోని పాకలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో సత్యనారాయణపురం, కోనరావుపాలెం ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో త్రీఫేస్ పొలాలకు వెళ్లే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించగా లైన్ మెన్ లక్ష్మి నారాయణ, ప్రైవేట్ ఎలక్ట్రిషన్ , గంగారం గ్రామానికి చెందిన కార్తీక్ లు సరఫరా నిలిచిపోయిన ప్రదేశానికి చేరుకుని మరమ్మత్తులు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అవటంతో కార్తీక్ విద్యుత్ షాకుకు గురయ్యాడు. గాయపడిన కార్తీక్ ను సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్థుతం కార్తిక్ పరిస్థితి నిలకడగా ఉందని ఏఈ అనుమోలు కావ్య తెలిపారు. అందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

# సిపిఎం నాయకురాలు రాజమ్మ మృతి

**-తమ్మినేని తో పాటు పలువురి నివాళి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రం కు చెందిన సీపీఎం నాయకురాలు...ఐద్వా ప్రతినిధి గోళ్ల రాజమ్మ (68) బుధవారం మృతి చెందింది. ఇటీవల అనారోగ్యంతో భాధపడుతున్నారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతదేహం ను పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఇటు పార్టీ, ఐద్వా అభివృద్ధి కోసం పని చేశారని పేర్కొన్నారు. మృతదేహం ను సందర్శించిన వారిలో సీపీఎం కేంద్ర కమిటి సభ్యులు తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి. సిరికొండ ఉమామహేశ్వరీ. వివిధ పార్టీల నాయకులు రాయపూడి నవీన్, దగ్గుల అంజిరెడ్డి, కొత్తా. రమేష్, గూడవల్లి రాంబ్రహ్మాం, కడియాల నరేష్, కూచుపూడి శ్రీదేవీ,జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు అత్తులూరి హనుమంతరావు, పెంట మళ్ల కోటయ్య,మల్లెబోయిన ఉపేందర్, గంజికుంట్ల వెంకన్న, వడ్లమూడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం వేడుకలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో ప్రజాపాలన దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాలను ఎగురవేశారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య ఆయా కార్యాలయాలలో జెండా ను ఎగురవేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యాలయాలలో కార్యదర్శులు కార్యక్రమం ను నిర్వహించారు. పైనంపల్లి సోసైటీలో చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, నాచేపల్లి సోసైటీ చైర్మన్ తన్నీరు సత్యనారాయణ లు జెండాలను ఎగురవేశారు. సుర్దేపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడియాల, శ్రీనివాసరావు, గరిడేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఆయా కార్యాలయాలలోఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.